
# పెత్తనం

సులోచన



వొణుకుతోన్న, చేతులతో జీవం చచ్చిన నరాలుపట్టుతప్పిపోతోంటే, నెమ్మదిగా – ముసలయ్య మొల్తాడున ఉన్న ఇనుపపెట్టె తాళంచెవుల గుత్తిని తీసి, శాంతమ్మ దోసిట్లో పెట్టేప్పటికి, శాంతమ్మకు దుఃఖం నిర్భరం కావటంచేత గొంతు చించుకొని బావురుమన్నది. ముసలయ్య కదులుతోన్న పెదాలను బలవంతాన తెరచి యిట్లా అన్నాడు అస్పష్టంగా.

"నాకు నేటితో... ఈ గడ్డమీద... ఋణం తీరింది...ఇహ ఈ యింటి భారమంతా నీదే!...రామిగాడు...అసలే అల్లరి చిల్లరగా...తిరిగేవాడు–వాడినో కంటకని పెట్టి ఉండు..."

ఆ మాటలు భర్త చచ్చిన మూడు నెలల వరకూ శాంతమ్మ హృదయంలో ఒక రకమైన రంపపుకోతతో నిలిచి ఉన్నాయి. పెళ్ళీడుకువచ్చిన కొడుకు వున్నప్పటికీ ముసలయ్య చస్తూ చస్తూ తనకే యినప్పెట్టె తాళం చెవు లిచ్చి, సంసారభారం తన మీదే వేసి, పెత్తనం అప్పగించటం ఆవిడకు కొంత గర్వం కలగటానికి కారణం కాకుండా పోదు. ఒక కుటుంబంమీద పెత్తనం చేయటం–ముఖ్యంగా ఆడది, ఒక రాజ్యాన్ని ఏలినంత హోదా అనే భావం శాంతమ్మలో తన తల్లీ, అత్తయ్యా, పిన్నీ తమ తమ కుటుంబాలకు పెత్తనం వహించి చెలాయించిన అధికారంవల్ల కలిగింది. ఆ హోదా ఆడదానికి రావటం గొప్ప అదృష్టంతో కూడిన పనని శాంతమ్మ నమ్మింది.

ముందుముందు తన కుటుంబం రెండు తరాలవరకీ ఎటువంటి ఆర్థికబాధలకు లోను కాకుండా ఉండేటట్టు ధనం తను పెత్తనంచేసి కూడబెట్టాలని ఆవిడ నిశ్చయించుకున్నదగ్గర్నుంచీ డబ్బు పొదుపు ఎక్కువచేయ నారంభించి కానీని రూపాయిగా చూస్తున్నది.

కొడుకు రామారావుకు తల్లి పెత్తనం రుచించలేదు. రోజుకు తండ్రి పావలా బీడీలకు, పైసాదరుకు మరోపావలా యిచ్చేవాడు. అటువంటిది తల్లి సాదరు ఖర్చు అనవసరమని త్రోసేసి, అధికంగా బీడీలు కాలిస్తే గుండెలో పసరు పేరుకొని మనిషికి ప్రమాదం కలిగిస్తుందని పావలా బీడీలను అణాకు బదిలీ చేసింది. నెలకు ఒక్క సినిమా చూడాలనీ, అదైనా నేలకుపోవాలనీ శాంతమ్మ కఠినంగా శాసించింది. చేసేది లేక రామారావు వూరుకున్నాడు. పేడను వుంటలుచేసి బ్రాహ్మలకు అమ్మేది. రెండు రోజులకు ఒకపూట మాత్రమే రామారావు అన్నంలో పెరుగువేసి మిగతాది అమ్మేది. నెయ్యి రెండు చినుకులు రాల్చి తాను ఒక్క కారంలో తప్ప వేసుకోకుండా అంతా అమ్మేది. ఎంత చేసినా అదేమని అనేవాళ్లు లేరుగా! కొలువాళ్ళ దగ్గర ఖచ్చితంగా వస్తు వసూలుచేసేది.

ఇంట్లో ఆడపెత్తనమని ఒకటి రెండు సంబంధాలు వెనక్కు తగ్గినప్పటికీ శాంతమ్మ పట్టుపట్టి పదివేల కట్నంతో రామారావుకు వివాహం చేసింది. పెళ్లికిగాను, ఇహ ఎటుగూడి ఒక్క కొడుకే–ఎంత ఖర్చు చేస్తే మటుకు ఏముంది, అని చెప్పేసి ఎక్కువ డబ్బు వెచ్చించి గొప్పగా పెళ్లి చేయలేదు. మేళతాళాలు లేకుండానే నూతన పద్ధతిలో ఆర్య సమాజపు పెళ్ళి చేసింది. ఊళ్లో ఏమనుకున్నా డబ్బు ఖర్చు కాకుండా ఉండే లెక్కలో ఆవిడకు లక్ష్యమేమిటి?

గత రెండు మూడు సంవత్సరాలనుంచీ శాంతమ్మ తన పెత్తనంలో భర్త పదేళ్లనుండి సంపాదించి నంత సంపాదించింది. ఇంకా ఆవిడకు తృప్తి కలగలేదంటే మనం ఆశ్చర్యపడాల్సింది లేదు.

సామాన్యంగా పెత్తనంచేసే వాళ్లు తాము అష్టకష్టాలుపడి పెత్తనం చేస్తున్నామనిన్నీ, తాము తప్ప అన్యులు నిర్వహించలేరనిన్నీ గొప్పకు చెప్పుకుంటారు. అట్లాగే శాంతమ్మ కొడుకూ కోడలు దగ్గర చాలాసార్లు చెప్పుకున్నది:

"ఈ యింటి పెత్తనం నాదుంప తెగటానికేవచ్చింది బాబూ! వార్ధక్యంలో కూడా సుఖపడే యోగంలేదు నాకు. క్షణం తీరిక చిక్కటంలేదు. నేకనుక సరిపోతున్నది కానీ మరొకళ్ళయితే కొంప నిలువునా గుల్లకావాల్సిందే!"

క్రమంగా శాంతమ్మ తన పెత్తనంవలన సాధించిన మరొక చెప్పుకోతగ్గ కార్యమేమిటంటే; కోడలు జానకమ్మకు తనంటే సింహస్వప్నంలాగా చేసుకుంది.

ఒకరోజున గేదె పాలు పితుకుతోంటే జానకమ్మ అశ్రద్ధవలన నైతేనేమి, గేద కాలు కదలించటంవలన నైతే నేమి పాలతపేలా ప్రక్కకు వొరిగి పాలన్నీ నేల పాలైనాయి. ఆ నేరానికిగాను శాంతమ్మ గుడ్లురిమి, "అంతకళ్లు నెత్తికెక్కాయా? వొళ్లు దగ్గరపెట్టుకొని పని చేయటం నేర్చుకో! ఎవరనుకొన్నావో–అర్ధరూపాయిపాలు మట్టి పాలైపోయాయి. నువ్వు సంపాదించేది ఏమన్నా ఉందా?" అన్నది.

జానకమ్మ తాత్కాలికంగా నోట్లో పైట చెంగు కుక్కుకొని తరువాత చాటుగా కళ్లు తుడుచుకొంది. ఇట్లా శాంతమ్మ తన ముందు కోడలు నోరు విప్పే తాహతు లేకుండా చేసుకుంది.

శాంతమ్మ పెత్తనంవల్ల కుటుంబానికి డబ్బుబాగా చేకూరిందని ఊళ్లోవాళ్లు చాలామంది అభిప్రాయపడి, ఆవిడను అభినందించారు.

శాంతమ్మ పొందిన ఆనందానికీ, గర్వానికీ అంతుందా?

*     *     *

భార్య కాపరానికి వొచ్చిన దగ్గర్నుంచీ రామారావుకు తల్లిప్రవర్తన, ముఖ్యంగా తనని అదుపు ఆజ్ఞల్లో పెట్టడం, భార్యను బానిసగా చేసుకోవటం – సుతరామూ నచ్చలేదు. ఆవిడ ఇరుగుపొరుగు యిళ్ళ వాళ్లతో కబుర్లు చెబుతూ, ఇంటి పనంతా కోడలుచేత చేయించటం కూడా

రామారావుకు నచ్చలేదు. ఈమధ్య అతను తల్లియిచ్చే డబ్బులు చాలక పది పదిహేను రూపాయలవరకూ ఊళ్ళోకిళ్ళీ దుకాణంలో అప్పు చేశాడు. కిళ్లీ దుకాణపు వీరాస్వామి బజార్లో కనపడ్డప్పుడల్లా నిలవేసి అడగటం రామారావుకు చిన్నతనంగా ఉండటమూ, అదే బజారు కావటంవలన తప్పించుకు తిరిగేందుకు కూడా వీల్లేకండా ఉండటమూ - పెద్దచిక్కుల్లో పెట్టింది. ఒక రోజున తెగించి విషయమంతా తల్లికి నివేదించి, అప్పు తీర్చే బాధ్యత తనపైనున్నదని చెప్పాడు. పైగా ఈ ఒక్క బాకీ తీరిస్తే ఇహ బాకీలు చేయనని కూడా ముందుగానే చెప్పాడు.

అందుకు శాంతమ్మ మూడవనేత్రపు ఛాయలు రెండు నేత్రాల్లోనే చూపించి, కొడుకును నానాతిట్లూ తిట్టి, "ముందు ముందు నీ బ్రతుకు బజారిపాలు కాకపోతే నే చెవి కోయించుకుంటాను" అని వాడి భవిష్యత్తు కూడా నిర్ణయించింది.

రామారావుకు వొళ్లు తెలియని కోపం వచ్చి ఉక్కిరి బిక్కిరయ్యాడు. పెనవది తను యింతవాడై, ఇరవైరెండేళ్ళ వయస్సులో వుండి, రేపో ఎల్లుండో తండ్రి కాబోతున్నవాడై తల్లి పెత్తనం క్రింద నీచపు బ్రతుకు బ్రతికటమా? తను ఎందుకు పెత్తనం చేయకూడదూ! అనే భావం అతనిలో బలంగా నాటుకుంది.

అందుకు తగినట్టుగానే ఇద్దరుముగ్గురు అతనితో అన్నారు:

"చెట్టంత పెరిగావు. ఇంకా నీవు ఒకళ్లచాటున బ్రతకటమేమిట్రా. మీ అమ్మనుంచి పెత్తనం లాక్కోలేవూ?"

భార్య నోటినుంచి కూడా విన్నాడు:

"ఏమిటండీ, మీ తల్లి పెత్తనం క్రింద మనం జీవించలేం. మీరు లాక్కోరాదూ పెత్తనం."

తరువాత ఒకరోజు డబ్బు ఖర్చుచేసే విషయంలోనే శాంతమ్మకూ రామారావుకూ పోట్లాట వచ్చింది. ఎన్నడూ ఎదురు తిరగనివాడు ఆరోజు పూర్తిగా ఎదురు తిరిగాడు. ఇదంతా కోడలు తనమీద చేసిన దుష్ప్రచార ఫలితమనుకొంది. కొడుకూ కోడల్నిద్దర్నీ కట్టిగా తిట్టింది శాంతమ్మ. రామారావు సహించలేకపోయాడు. తల్లిని తిట్టి కొట్టాడు.


"ఏమో అనుకుంటున్నాను. ఇకనుంచి నాదే పెత్తనం. నీదేమీ లేదు. ఇంత పడవేస్తాం. తిని ఊరుకో!" అని రామారావు ఇనప్పెట్టె తాళంచెవులు శాంతమ్మ దగ్గర్నుంచి బలవంతాన లాక్కున్నాడు. శాంతమ్మకు తెరిచిన నోరు తెరిచినట్టుగానే, తడిఅయిన కళ్లు తడి అయినట్టుగానే ఉండిపోయినాయి. తన ఎరుకలో ఉన్న నలుగురైదుగురు పెద్దమనుషుల్ని పిలిపించి, వాళ్ళదగ్గర యేడ్చి, కొడుకు దౌష్ట్యాన్ని కళ్లకద్దాలు కట్టినట్టు చెప్పింది.

"ఇది నా స్వవిషయం. ఇందులో జోక్యం కలిగించుకోవాల్సిన అగత్యం మీకు లేదు." అని ఖచ్చితంగా చెప్పాడు, రామారావు ఆ పెద్దమనుష్యులకు.


శాంతమ్మ తన మంచితనం అక్కరకు రాలేదని శోకాలు తీసింది. అవి రామారావు చెవికి కానీ, జానకమ్మ చెవికి కానీ సోకలేదు అక్కడున్న పెద్దమనుష్యుల చెవులకు తప్ప.

శాంతమ్మ మామూలు మనిషైంది. కాని తాను అంతకంటె హీనస్థితిలోకి దుమికినట్టు ఆవిడ అభిప్రాయపడుతూంది. పూర్వపు ఔన్నత్యమూ, అహంకారమూ, గర్వమూ, ఠీవి ఆవిడలో లేకపోవటమే కాక విచారమూ, న్యూనతా, అణుకువా కలిగి ఉండాల్సిన దుస్థితి ప్రవేశించింది.

తల్లి దగ్గర్నుంచి పెత్తనం చేచిక్కించుకున్నాడు రామారావు. ఇక అతను ఆ యింటికి సర్వాధికారి. ఏది జరగాలన్నా అతనిపరంగానే. వీడు యేడాదిలోనే



ఇనుపపెట్టె తాళంచెవుల గుత్తితీసిశాంతమ్మ దోసిట్లోపెట్టేటప్పటికిశాంతమ్మ గొంతు చించుకునిబావురుమంది



ఉద్యోగి:- సార్. రేపు నాకు కొంచెం పనుందండి. సెలవు తీసుకోమంటారా?

అధికారి:-ఏం పని?

ఉద్యోగి:-నా భార్య రేపు ఏవో నగలు బేరం చేయాలనుకుంటోందండి.

అధికారి:- వీల్లేదోయ్. రేపిక్కడ చెయ్యాల్సిన పని చాలా వుంది.

ఉద్యోగి:- (సంతోషం పట్టలేక) థాంక్యూసార్. మీ ఋణం ఎన్నటికీ తీర్చుకోలేనండి.

తను సంపాదించిన ధనమంతా కర్పూరాన్ని కరిగించినట్టు కరిగించివేస్తాడు, ఎట్లారా భగవంతుడా! అనుకుంది, శాంతమ్మ. రామారావుమీద ఆవిడకు యేమాత్రం విశ్వాసం లేదు. భర్త చనిపోతూ అన్నమాటలను ఆవిడ జ్ఞాపకం చేసుకోని దినంలేదు.

జానకమ్మ తన భర్త పెత్తనం వహించగానే ఎప్పటికిమల్లే శాంతమ్మకు దడిచి పని చేయటంలేదు. ఇది మరీ శాంతమ్మ అహానికి గొడ్డలిపెట్టు. కొడుకు గూడా అననే అన్నాడు.

"దానిచేత అస్తమానమూ పనిచేయించకపోతే నీవుకూడా చేయరాదూ!"

ఇంకా మూడుపూటలూ తిని పనిచేసే దాసీకీ తనకీ భేదమేముంది అనుకుంది శాంతమ్మ.

రామారావు పెత్తనం వహించి నెలగడిచిందో లేదో చాలా అనవసరమైన ఖర్చులు చేస్తున్నట్టు శాంతమ్మకు అగపడ్డది. ఇద్దరి పిల్లలకూ, తనకీ, భార్యకూ మంచి మంచి గుడ్డలు తెచ్చాడు. పై పెచ్చు ఒక రేడియో సెట్టు తెచ్చి, యింట్లో పెట్టాడు. ఇవన్నీ అనవసరమైన ఖర్చులు కాక మరేమిటి?

డబ్బును ఎట్లా గడించాలో, గడించిన డబ్బును ఎట్లా దాచవలెనో శాంతమ్మ అనుభవపూర్వకంగా, ఉదాహరణలతో సహా చెప్పింది. రామారావు ఆలకించి ఆచరణ సాధ్యం కాదని ఊరుకున్నాడు. రామారావుది యువకరక్తం కనుక, ఒక ఆశయాన్ని యేర్పరచుకొని దాని ప్రకారం జీవితాన్ని నెట్టుకుపోవాలనే ఉద్దేశ్యం లేనివాడు కనుక, నియమాల ప్రకారం నడుచుకోలేనివాడు కనుక-ఇంట్లో ఉన్న డబ్బును ముందూ వెనుకా ఆలోచించుకోకుండా సౌఖ్యంకోసం ఖర్చుపెడుతున్నాడు.

ఊళ్లో క్రొత్తగా ఒక సినిమాహాలు ప్రారంభించారు. అందులో రామారావు భాగం కలిశాడు. మిగతా ముగ్గురు భాగస్థులు ఒకపై సంవత్సరాంతమున అయిదు వేలు నష్టం చూపించారు. అంతే కాకుండా రామారావు వ్యభిచారానికి అలవాటుపడి చాలా డబ్బు ఖర్చుపెట్టాడు. ఒక్క సంవత్సరంలో శాంతమ్మ సంపాదించిన డబ్బంతా ఖర్చుపెట్టాడు. శాంతమ్మ గుండె బాదుకొని విలపించటం తప్ప యేమీ చేయలేకపోయింది. మొదట్లో భర్త ప్రవర్తన చెడుగా కనబడకపోయినప్పటికీ జానకమ్మకు రానురాను భర్త కేవలం చెడు తిరుగుళ్లు తిరుగుతున్నాడనే నమ్మ సాగింది.

మరో సంవత్సరంలో ఒక యకరం పొలం అమ్మాడు.

ఒక కాఫీహోటలు తెరిచాడు, అయిదు వందల పెట్టుబడితో. ఆ హోటలు నడిచింది మూడు నెలలే అయినా ఎనిమిది వందలు నష్టం వచ్చింది. స్నేహితులు, రౌడీలు తినటమే కాని డబ్బు ఇవ్వటం లేదు. రూపాయలకు రూపాయలు అప్పులు పెట్టిన వాళ్లు కానీ యిచ్చిన పుణ్యానపోలేదు. గల్లాపెట్టిలోని డబ్బులు యేరోజు వారోజువి సొంతం రామారావుకు చేరేవి కావు.

ఇంకో ఎకరానికి సరిపడ్డ అప్పు చేశాడు, రామారావు.

ఇక లాభం లేదనీ, యిట్లా రెండు సంవత్సరాల్లో ఉన్న అయిదెకరాల పొలం కాజేస్తాడనీ, పిల్లలకు బొచ్చె తప్ప మిగలదనీ తేల్చుకొని శాంతమ్మా, జానకమ్మా—రామారావు మామకు కబురు చేశారు. జానకమ్మతండ్రి వచ్చి అల్లుడి పరిస్థితంతా కనుక్కున్నాడు.

"ఇట్లా చేస్తే ఎట్లారా అబ్బాయి. పొదుపుగా డబ్బు కూడబెట్టే మీ అమ్మని కొట్టి పెత్తనం లాక్కొని యింత నీచంగానా ప్రవర్తించేది? పిల్లలు, భార్య, తల్లి ముందుముందు యేం కాను? వీళ్ళంతా నీ మీదనే ఆధారపడి జీవించేవాళ్ళే కదా! నీ అంతట నువ్వు చెడుదిరుగుళ్లు తిరిగి డబ్బంతా ఖర్చు పెట్టేస్తే రేపు అందరి బ్రతుకులూ బజారు పాలేగా! ఇక పెద్దవాణ్ని నా మాట విని, ధనం వ్యయం చేయటం మానుకో! తల్లి చెప్పినట్టు విను." అని చెప్పాడు, జానకమ్మ తండ్రి.

ఇట్లా చెప్పేవాళ్లని చాలామందిని చూశాను అనుకున్నాడు రామారావు. ఒక చెవిని వింటూంటే మరో చెవినుంచి దాటిపోయినయ్ ఆ మాటలు.

తన మాటలు వినిపించుకోలేదని ఇంకో నెలరోజులు గడిచింతరువాత అర్థమైంది, జానకమ్మ తండ్రికి. పై పెచ్చు రామారావు త్రాగుడు కూడా అలవరచుకొన్నాడు. జానకమ్మతండ్రి నిష్ఠాతుడు. ఇక ఈ విధంగానైతే లాభం లేదని చెప్పి-ఇంకో సంవత్సరమూ రెండుసంవత్సరాలూ గడిస్తే ఉన్న పొలం కాస్తా అయిపోతుందని శాంతమ్మకు నచ్చచెప్పి, ఆ పొలం కాస్తా జానకమ్మ పేరె వ్రాస్తే పిల్లలకి భవిష్యత్తులో తిండి ఉంటుందని అన్నాడు. శాంతమ్మ ఒక పట్టాన ఒప్పుకోలేదు. ఎంత చెడ్డా తనవాడు, తనకి పుట్టినవాడు-వాడి నుంచి పెత్తనం మరొకళ్ళ చేతులోకి పోవటం తనకంత శ్రేయస్కరమైంది కాదు. చివరకు అంతకంటె గత్యంతరం లేక, ధనమే వాణ్ని ఆవిధంగా మార్చిందని నమ్మి వియ్యంకుడి వాక్యాల ప్రకారం ఒప్పుకుంది. కాని రామారావు అట్లా వ్రాస్తాడా?

కరణంగారితో ఆలోచించాడు జానకమ్మ తండ్రి. త్రాగించి మనస్సు సరిగా లేనప్పుడు మన పనికి ఉపయోగించుకోవచ్చు అన్న సలహాప్రకారం జానకమ్మ తండ్రి పొలమంతా కూతురు పేర వ్రాయించి అల్లుడిచేత సంతకం పెట్టించాడు.

తీరా అంతా జరిగిపోయింతరువాత తన కొడుకుకు యేదో అపచారం పరాయివాళ్ల వల్ల జరిగినట్టు బాధపడింది శాంతమ్మ.

* * *

ఇనప్పెట్టె తాళంచెవులు తాను దగ్గరుండి కూతురుకు యిప్పించాడు, జానకమ్మ తండ్రి-ఆయన నెలరోజులపాటు వుండి రామారావుకు నీతిబోధలు చేసి కూతురుమీద ఈగ వాలనీయకుండా చూసి వెళ్లాడు.

శాంతమ్మకు ఆలోచించుకొన్నకొద్దీ ఆశ్చర్యం వేసింది. ఏమిటి, తన యెదుటే తన యింటి పెత్తనం ముగ్గురిదగ్గరకు మారింది. లోకమంతా యింతేనా?

రామారావు జరిగిన అపచారం తెలుసుకున్నాడు. ఇదంతా మామయ్య కుట్రని నిర్ణయించుకున్నాడు. భార్యదగ్గర తిట్టాడు.

“అంతా నీ మేలుకోరకేరా! నీ పిల్లలు ముందుముందు బ్రతకటానికేరా?” అని అన్న శాంతమ్మను కొట్టే పర్యంత మయ్యాడు, రామారావు.

సహజంగా పెత్తనం చేతికిరాగానే సంతసం, గర్వంపొందినట్లే జానకమ్మ కూడా తాళంచెవుల గుత్తిని బొడ్లో పెట్టుకొని అధికారిణి ఠీవి చూపించింది కాని, అయితేనేం-రామారావుముందు చెల్లలేదు. రామారావు కిల్లీదుకాణం పెట్టాడు, హోటలు ఎత్తేసి. దుకాణంమీద వొచ్చే రెండూమూడు రూపాయలు యేం చాలతాయి? ఇంట్లో డబ్బు లివ్వమని భార్యను వేధించుకుతింటున్నాడు. ఇవ్వనంటే తిడతాడు, కొడతాడు.

రోజూ జరిగే ఈ తతంగాన్ని భరించలేక జానకమ్మ, “మా నాన్నని పిలిపిస్తాను” అన్నది. వాళ్ల తల్లి చావడంతో తండ్రి ఒక్కడే వండుకొని తింటూ వుంటున్నాడు.

“ఏం పిలిపిస్తే. ఎవడికి లావు. ఎవడికి భయం. ఏదీ ఈతఫా రానియ్ చెబుతాను. ఇంత మోసంచేసి వెళ్ళినవాడు మళ్ళీ ఏ ముఖంతో వస్తాడో!” అన్నాడు రామారావు, రోషంగా.

కాని మరి జానకమ్మ కబురుచేస్తే వచ్చినప్పుడు మామముందు యేమీ మాట్లాడలేకపోయినాడు. జానకమ్మ తండ్రి వారంరోజు లుండిపోయినాడు. ఆ వారం రోజులూ అల్లుడుకు యేవేవో చెబుతూనే ఉన్నాడు. రామారావు ఆలకించినా తనకి సంబంధించిన విషయాలు కావనుకున్నాడు.

తండ్రి వెళ్ళేటప్పుడు అన్నది జానకమ్మ.

“నాన్నా! నీవు అక్కడైనా చెయ్యి కాల్చుకోవాల్సినవాడివేకదా? ఇక్కడే వుండిపోరాదా. ఆయన నిత్యం డబ్బులివ్వమని నన్ను ఛండాలంగా కొడుతూ వుంటాడు. నువ్వే యిక్కడ వుండి పెత్తనం చేయకూడదూ!” అన్నది.

“కాదులే. బాగుండదు. వాడే దారికి వస్తాడులే” అని వెళ్లిపోయాడు జానకమ్మ తండ్రి.

ఇంతకాలానికిగాను శాంతమ్మకు కోడలుచేత మాట అనిపించుకోవాల్సిన గతి పట్టింది. పెద్దతనం వొచ్చాక కూడా తిని కూచోటానికి లేదు. అథవా అల్లా కూచుంటే, “తినంగా సరా! కుటుంబం అన్న తరువాత గంపెడు పనులుంటాయి. అంతా ఒక్కరూ ఎట్లా చేస్తారు. సాయ పడకూడదూ?” అంటుంది జానకమ్మ. ఏమీ పనిలేకపోతే శాంతమ్మకు పిల్లల్ని ఆడించమనైనా పని చెబుతుంది. పెత్తనం పతనమైపోయిన మనుషులంటే ఎంత తేలిక?

ఒకరోజు మధ్యాహ్నం “నాకు పాతిక రూపాయలు కావాలి? ఇవ్వు” అన్నాడు రామారావు భార్యతో.

“ఎందుకు?” అన్నది జానకమ్మ.

“ఎందుకా! నాక్కావాలి? ఎందుకు అనటానికి నువ్వెవతెవు. నీకేం అధికారముంది. ఇంకా పైగా నా ఆస్తంతా తింటూ నా డబ్బు నాకు పారేయమంటే నీ కంత గింజాట నెందుకూ?”

అవతల పిల్లవాడు గుక్కపట్టి యేడుస్తోంటే జానకమ్మ భర్తమాటలు సరీగ్గా వినిపించుకోకుండా పిల్లవాణ్ని సముదాయించను పోయింది. రామారావుకు అమితమైన కోపం వచ్చింది. సముదాయిస్తోన్న భార్యను వెనకపాటుగా వెళ్ళి వీపుమీద బలంకొద్దీ గుద్దాడు.

“అమ్మో!” అంటూ క్రింద పడింది. చావట్లో కోళ్ళకు బియ్యపుగింజలు వేస్తూన్న శాంతమ్మ తత్తరపాటుగా వొచ్చి రామారావును పట్టుకుంది. రామారావు తిడుతున్నాడు.

రెండు నిముషాలు గడిచాక జానకమ్మ తెగించి అన్నది. “మీరు ఎంతవరకు కొడతారో చూస్తాను. మీకు దమ్మిడీ ఇవ్వను. ఏంచేస్తారో చేయండి. రేపు మా నాన్నకు కబురుచేస్తాను. ఈ కొంపలో మీతో నేను వేగలేను.”

రామారావుకు కళ్ళల్లోకి యెగ తన్నింది కోపం. జానకమ్మను తన్నబోయాడు. శాంతమ్మ బలవంతాన ఆపింది. బండబూతులు తిట్టి బజారు కెళ్ళాడు.

జానకమ్మ తండ్రి దిగాడు, మరుసటి రోజు - జానకమ్మ యేడ్చి జరిగిందంతా పూసగ్రుచ్చి చెప్పి, “ఇక నువ్వు పెత్తనం చేయాల్సిందే నాన్నా!” అన్నది.

జానకమ్మ తండ్రి కొంచెంసేపు ఆలోచించి “సరే” అని శాంతమ్మతో సంప్రదింపులు జరిపాడు. ఆవిడ అదిరిపోయి కొసకు ‘నాదేముంది’ అన్నది.

జానకమ్మ తండ్రి ఇనప్పెట్టి తాళం చెవులు మొలత్రాడులో కట్టుకున్నాడు.

శాంతమ్మ లోలోపల కుమిలిపోతోంది. జానకమ్మ రాణీత్వం వెలిగిస్తోంది. రామారావు తోకతెగిన కుక్కలాగా యేమీ పాలుపోక తిరుగుతున్నాడు. మామమీద అంతులేని ద్వేషం పెరిగిపోతోంది కానీ అతనికి కర్తవ్యం బోధపడటంలేదు.

జానకమ్మ తండ్రి రామారావుకు రోజు కింతని ‘బేటా’ రూపంలో డబ్బులిస్తున్నాడు. జానకమ్మ శాంతమ్మని తన క్రింద బానిసగా చేసుకుంది.

తన పెత్తనంలో డబ్బును కూడబెట్టాలని జానకమ్మ తండ్రి నిశ్చయించుకున్నాడు. ఊళ్లోవాళ్లు తమని అసహ్యించుకున్నప్పుడు రామారావు కానీ, శాంతమ్మకానీ సమాధానం చెప్పలేకపోయినారు.

పెత్తనమనేది ఒకరికి జన్మతో వచ్చిన హక్కుకాదు. అది ఎల్లప్పుడూ ఒకరి అధర్యాన్నే, ఒకరనే ఆవరించుకొని ఉంటుందనేదాంట్లో నిజంలేదు. కాని పెత్తనం ఎక్కువకాలం నిలుపుకోనే సమర్థత, నేర్పు చాలకొద్దిమంది కుంటుంది. అవకాశం వున్న ప్రతివారికీ పెత్తనం చేయాలనే ఆరాటం జాస్తిగానే వుంటుంది. అయితే, సామర్థ్యం ఎక్కణ్నుంచి వొస్తుంది? ★

కుట్టుపని స్వబోధిని (తెలుగు)
Self Tailoring and Cutting Teacher"
కొత్త పద్ధతిలో కత్తిరించి కుట్టు పాఠములు కలది. ప్రతి దర్జీవారికి, స్త్రీలకు ముఖ్యము. 96 పేజీలు 42 పటములుగల పుస్తకము అ. 12 పోస్టుఖర్చులు అ. 7. మహారాజ పుస్తకశాల అరుణాచల మొదలి వీధి, 26 బీటు, మద్రాసు.

కుష్ఠు ★ బొల్లి
వగైరా మేహముచ్చలు, సెగ, సవాయి వ్యాధులకు, గ్యారంటి చికిత్స, క్యాటలాగు ఉచితం. జి. వి. రెడ్డి అండ్ కో., (రిజిష్టర్డు) “భాస్కరాశ్రమము” గోపాలపురం, తూ. గోదావరి.

ఉబ్బసము & టి. బి.
క్రిములు ఒక దినములోనే నాశనమగును. “ఒక సీసాతోనే గ్యారంటీగా సంపూర్ణ ఆరోగ్యము పొందవచ్చును.” ‘ఆస్మోడినా’ (రిజి). చనిపోయిన కువాల్ రాకుమారుని బ్రతికించిన యోగి ధర్మదాస్ నాగవారి ఔషధము రు. 3/- ఇంగ్లీషులో ఉత్తరాలు వ్రాయండి.
W. DYE & CO., (A. P) Anandapuri, P. O. Barrackpore, Dist 24 Parganas.